
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 25.0 । కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5



వనపర్తి
జిల్లా వార్తలు
బుధవారం 29 అక్టోబరు 2025

ధరణి సొమ్ము దక్కేదెప్పుడు..?

- అయోమయంలో దరఖాస్తుదారులు
- ప్రభుత్వాలు మారినా తిరిగిరాని సొమ్ము
- ధరణి ప్రారంభమై నేటితో ఏడేళ్లు
- 11,000 దరఖాస్తుదారులు

6





దాసంగాలతో నైవేద్యం పెడుతున్న భక్తులు



ఉద్దాలోత్సవం నిర్వహిస్తున్న జాతర మైదానంలో కిక్కిరిసిన భక్తులు

దారులన్నీ.. కురుమూర్తి వైపే

- ఉద్దాలోత్సవానికి తరలొచ్చిన భక్తులు
- పల్లమర్రి నుంచి చాట ఊరేగింపు
- ఉద్దాలను దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి
- కిక్కిరిసిన జాతర మైదానం



కురుమూర్తి ఆలయం వద్ద కోనేరులో స్నానమాచరించి మొక్కుతున్న భక్తులు



ఉద్దాలకు పూజలు చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) తెలంగాణ పేదల తిరుపతిగా పిలుస్తున్న కురుమూర్తి వేంకటేశ్వర స్వామి ఉద్దాలోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. దారులన్నీ కురుమూర్తి వైపే కదిలాయి. ఎడ్లబండ్లు, ఆటోలు, కార్లు, బస్సులు, ప్రైవేటు వాహనాలతో పాటు మరికొందరు భక్తులు నడుచుకుంటూ వచ్చారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలొచ్చారు. దాంతో తెల్లవారుజాము నుంచే జాతర మైదానం భక్తులతో నిండింది. జాతర మైదానం చాలక చిన్నచింతకుంట, గూడూరు, తిరుమలాపూర్, అమ్మాపూర్ తదితర గ్రామాల శివారు ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాల్లో భక్తులు ట్రాక్టర్లు, ఆటోలు, ఎద్దుల బండ్లకు ప్లాస్టిక్ కవర్లు కట్టుకుని

మిగతా 6లో..



కురుమూర్తి జాతరలో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ జానకి



ఉద్దాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు..



కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు



సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చింతకింది కాశీం

సమ సమాజం కోసం విద్యార్థులు పోరాడాలి

- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం

7

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

- దుందుభీ వాగు నుంచి నిలిచిన ఇసుక అక్రమ రవాణా
- మైనింగ్ అధికారులపై కలెక్టర్ సీరియస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : దుందుభీ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ బదావత్ సంతోష్ రెవెన్యూ, మైనింగ్ అధికారుపై సీరియస్ అయ్యారు. ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఇసుక మాఫియా చేతిలో దుందుభీ బందీ' అనే శీర్షికపై వచ్చిన కథనం కలకలం రేపింది. రెవెన్యూ, పోలీస్, రాజకీయ పలుకుబడి కలిగిన నాయకులు దుందుభీ వాగు నుంచి రోజుకు వంద టిప్పర్ల చొప్పున ఇసుకను అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారని వచ్చిన కథనంతో అధికార యంత్రాంగంలో కదలిక మొదలైంది. దాదాపు వంద టిప్పర్లలో ఇసుక రాజధానికి అక్రమంగా తరలి వెళ్తున్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్లకు మాత్రం ఇసుక లేక ఇక్కట్లకు గురవుతున్నారని వచ్చిన కథనంతో కలెక్టర్ బదావత్ సంతోష్ రెవెన్యూ, మైనింగ్ అధికారులపై సీరియస్ అయ్యారు. ఈ క్రమంలో ప్రత్యేకంగా ఇసుక తరలింపుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరిగితే తక్షణం ఆ వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో స్థానిక అవసరాల మేరకు ఇసుక వినియోగం పారదర్శకంగా జరగాలని ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పత్తి, వేరుశనగకు తీరని నష్టం



రామాపురంలో మొలకెత్తిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు స్వాములు

6

అలంపూర్ ఆలయాల్లో లీకు వీరులు!

ఆలయం దాటకముందే సోషల్ మీడియాలో వైరల్



జోగుళాంబ అమ్మవారి ఆలయం

7

ఐకానిక్ వంతెన నిర్మాణానికి అడుగులు

- ప్రతిపాదిత ప్రదేశాన్ని పరిశీలించిన అటవీ శాఖ అధికారులు



నల్లమలలో ఎన్‌హెచ్ 167కే స్థలాన్ని పరిశీలిస్తున్న అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు ఫీల్డ్ డైరెక్టర్ సునీల్ హిరేమత్, జిల్లా అటవీ అధికారులు

కొల్లాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాయలసీమ ప్రాంతాలను అనుసంధానం చేసేందుకు సోమశిల వద్ద కృష్ణానదిపై చేపట్టనున్న ఐకానిక్ వంతెన నిర్మాణ స్థలాన్ని అధికారులు పరిశీలించారు. అదేవిధంగా అటవీశాఖ కోల్పోతున్న ప్రదేశాన్ని మంగళవారం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు ఫీల్డ్ డైరెక్టర్ సునీల్ హిరేమత్, జిల్లా అటవీ శాఖ అధికారి లోహిత్ గోపిడిలు పరిశీలించారు. ఐకానిక్ వంతెన నిర్మాణంలో భాగంగా కొల్లాపూర్ రిజర్వ్ ఫారెస్టు గుండా వెళ్తున్న ఎన్‌హెచ్ 167కే మార్గంలో అటవీ సిబ్బంది చేపడుతున్న చెట్ల గణనను ఆయన తనిఖీ చేశారు. అదే విధంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో వెళ్తున్న రహదారి మార్గాన్ని ఖచ్చితంగా గుర్తించి అక్కడ పిల్లర్ నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో త్వరలోనే కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన నిర్మాణం పనులు ప్రారంభం కాబోతున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి, అధికారులు చంద్రశేఖర్, రామ్మోహన్, కాషన్న, ఎండీ ముజీబ్‌గోరి, శివ కుమార్, భయ్యన్న, నీలేష్, కిరణ్, నాగార్జున, శ్యాం, మహేష్, లిఖిత ఉన్నారు.



ఉద్దాల తయారీలో దళితులు

వడ్డెమాన్ దళితులు కురుమయ్య సేవకులు

- తరతరాలుగా వస్తున్న ఆచారం
- అత్యంత నియమ నిష్ఠలతో స్వామి వారి ఉద్దాల తయారీ

6

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 130.00
హోల్ సేల్	: 139.00
డ్రెస్డ్	: 234.00
స్కిన్ లెస్	: 251.00

లెక్క తీస్తున్నారు..

- గ్రామ పంచాయతీలలో కొనసాగుతున్న ఆదాయ, వ్యయాల మదింపు
- ఇప్పటికే సగానికి పైగా పూర్తి
- 15 అంశాల ఆధారంగా గణాంకాల సేకరణ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలలో కొన్నేళ్లుగా నిర్వహించిన ఆర్థిక కార్యకలాపాల లెక్కలను మదింపు చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ సూచనల మేరకు 2019 నుంచి ఈ ఏడాది మార్చి నాటికి జరిపిన ఆదాయ వ్యయాలను లెక్కించి ఉన్నతాధికారులకు అందించే పనిలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు నిమగ్నమయ్యారు. వనపర్తి జిల్లాలో 268 గ్రామ పంచాయతీలు ఉండగా ఇప్పటికే సగానికి పైగా పంచాయతీల్లో పని పూర్తి చేశారు. మిగిలిన పంచాయతీల్లో గణాంకాల సేకరణ కొనసాగుతోంది.

2019 నుంచి ఆదాయ వ్యయాల మదింపు

ప్రభుత్వం నిర్దేశించిన సూచనల ప్రకారం ఆదాయ వ్యయాల మదింపులో భాగంగా 15 అంశాలకు సంబంధించిన గణాంకాలను అధికారులు సేకరిస్తున్నారు. 2019 సంవత్సరం నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన ఆర్థిక వ్యవహారాలన్నింటిని లెక్కించి నివేదిక అందించడానికి అధికారులు శ్రమిస్తున్నారు. ఈ మధ్యకాలంలో పంచాయతీలకు వచ్చిన నిధులు ఎన్ని, అందులో ఖర్చు చేసింది ఎంత అనే వివరాలను సేకరిస్తున్నారు. ఇందుకోసం కొన్నేళ్లుగా మూలన పడిన దస్త్రాల దుమ్ము దులుపుతున్నారు. పద్దుల వారీగా మంజూరైన నిధులు, ఏ పనికి ఎంత ఖర్చు చేశారో లెక్కిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా లభించిన సమాచారాన్ని జిల్లాలోని ఆడిట్ అధికారులు సేకరించి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. కొన్ని గ్రామ పంచాయతీలలో గణాంకాల సేకరణ ఇప్పటికే పూర్తి కాగా మరికొన్ని గ్రామాల్లో కొనసాగుతోంది. పంచాయతీల ఆదాయం ప్రధానంగా కేంద్ర ఆర్థిక సంఘం గ్రాంట్లు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులపై ఆధారపడుతోంది. 2019-2024 మధ్య 14వ ఆర్థిక సంవత్సరం గ్రాంట్లు మంజూరయ్యాయి. ఆ తరువాత నిధుల విడుదల నిలిచిపోయింది. పంచాయతీ ఎన్నికల ఆలస్యం వల్ల కేంద్రం నిధులు రాకపోగా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ఆర్థిక సాయం నిలిచిపోయింది. దీంతో పంచాయతీలకు ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం అందలేదు.



గ్రామ పంచాయతీ కార్యాలయం, గట్టుకాడిపల్లి

ఆదాయం తక్కువ.. ఖర్చులు ఎక్కువ

పంచాయతీలకు సొంత ఆదాయవనరులు నామమాత్రంగానే ఉండటంతో నిధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఆధారపడే పరిస్థితి ఉంది. ఆస్తి పన్నులు, నల్లా బిల్లులు, ఇసుక-మట్టి క్వారీలు, క్రషర్‌లు, వారాంత సంతలు (తైబజార్) వంటి వాటి ద్వారా కొంత ఆదాయం పంచాయతీలకు వస్తోంది. కానీ జిల్లాలోని చాలా పంచాయతీలకు ఇటువంటి వనరులు లేకపోవడంతో సిబ్బంది వేతనాలు ఇవ్వాలన్నా ప్రభుత్వ నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది. కానీ 2024 మార్చిలో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు కూడా నిలిచిపోయాయి. ఫలితంగా పంచాయతీ కార్యదర్శులపై నిర్వహణ భారం పడింది.

రెటినోపతి వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ ఆదర్శ్‌సురభి



వైద్యాధికారులకు సూచనలు చేస్తున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మధుమేహం వ్యాధి గ్రస్థులకు రెటినోపతి వల్ల అంధత్వం వస్తుందని, ఈ వ్యాధి నివారణ కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, మెడికల్ కళాశాల నేత్ర వైద్య డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జితో రెటినోపతి వ్యాధి నివారణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రెటినోపతి వ్యాధిని ముందుస్తుగా గుర్తించేందుకు రెటినోస్కోపీ అనే అత్యాధునిక సాంకేతిక పరికరాన్ని అవసరమైన మేరకు కొనుగోలు చేయాలన్నారు. నవంబరు 14 నుంచి 100 రోజుల పాటు పీహెచ్‌సీల వారీగా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి మధుమేహం వ్యాధిగ్రస్థులకు రెటినోపతి వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించా రు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్రరావు, నోడల్ అధికారి డాక్టర్ రియాశ్రీ, నేత్ర వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాలక్రైం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీను ఏర్పాటు చేయాలని, ప్రతీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కూడా పిటీషన్ ఎంక్వైరీలో భాగంగా గ్రామాలకు వెళ్లాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నేరసమీక్షా సమావేశంలో పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. దొంగతనాలు, ఆర్థిక నేరాలలో ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తును ముమ్మరం చేయాలని, పోగొట్టుకున్న నగదు, వస్తువులను బాధితులకు అప్పగించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రవి, గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, అలంపూర్ సీఐ రవి బాబు, శాంతినగర్ సీఐ టాటా బాబు, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు, డీసీఆర్బీ ఎస్‌ఐ సిబ్బంది ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు విద్యార్థుల ఆందోళన

7

'జెన్‌కో ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టాలి'

7

అనుమతులు సరే నియామకాలేవీ?


ప్రీప్రైమరి విద్యార్థులకు బోధకులు లేకపోవడంతో గాధిర్యాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో బోధిస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయురాలు

(5వ పేజీ తరువాయి)

నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గత సెప్టెంబరు రెండో వారంలో దరఖాస్తు గడువు పూర్తయ్యింది. ప్రతీ పాఠశాల పరిధిలో అధికంగా దరఖాస్తులు వచ్చాయి. ప్రతీ గ్రామంలో ఒక్కో పోస్టుకు 15 నుంచి 20 దరఖాస్తులు వచ్చాయి. మండల పరిధిలో వారిని ఎంపిక చేసి, జిల్లా విద్యాశాఖ అధికారికి పంపిచాలన్న నిబంధన ఉంది. ఎంపిక కోసం ముగ్గురితో కమిటీని వేశారు. కమిటీలో తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి, మండల విద్యాశాఖ అధికారి ఉన్నారు.

ఎంపికలో రాజకీయ రంగు

బోధకుల కోసం ఇంటర్‌లో అధిక మార్కులు ఉన్న వారిని, ఆయాల కోసం ఏడో తరగతిలో ఎక్కువ మార్కులు ఉన్న వారిని ఎంపిక చేసి, డీఈవోకు సీల్డ్ కవర్‌లో పంపాలి. సగం మండలాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపిక చేపట్టగా, మిగతా మండలాల్లో రాజకీయ రంగు పులుముకోవడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. అధికార పార్టీ నాయకులు చెప్పిన వారినే ఎంపిక చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో బోధకుల నియామకాల విషయంలో తీవ్రజాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని 17 మండలాలకు సంబంధించి 26 పూర్వ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. మూడు మండలాల్లో బోధకులు, ఆయాల ఎంపికపై ఒత్తిడి ఉండటంతో జాప్యం జరుతున్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. నెలకు బోధకులకు రూ.8,000, ఆయాలకు రూ.6,000 వేతనం ఇవ్వనున్నారు.

94 పాఠశాలలు ఎంపిక

పూర్వ ప్రాథమిక పాఠశాలల నిర్వహణకు పైలట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలో 94 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో మహబూబ్‌నగర్ జిల్లాలో 26 ఉన్నాయి. నాగర్ కర్నూల్ జిల్లాలో 21, జోగులాంబ గద్వాలలో 19, వనపర్తిలో 16, నారాయణపేటలో 12 పాఠశాలలను ఎంపిక చేశారు. దసరా సెలవుల అనంతరం ఈ పాఠశాలలను ప్రకటించారు. సెలవుల తర్వాత పాఠశాలలకు విద్యార్థులు కూడా వస్తున్నారు. బోధకులు, ఆయాల నియామకాలు పూర్తి కాకపోవడంలో ఈ పాఠశాలల భారం రెగ్యులర్ ఉపాధ్యాయులపై పడింది. దీంతో వారే బోధన చేస్తున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో తరగతుల నిర్వహణ, మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ బాధ్యతల్లో బిజీగా ఉన్నారు. అదనంగా పూర్వ ప్రాథమిక పాఠశాలల నిర్వహణ బాధ్యత కూడా ఇవ్వడంతో బోధనలో నాణ్యత తగ్గే అవకాశం ఉందని అంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 13 మండలాల్లో ఎంపిక ప్రక్రియ పెండింగ్‌లో ఉంది.

తర్వలోనే పూర్తి చేస్తాం



పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో బోధకుల ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే చాలా మండలాలకు సంబంధించి ఎంపిక జాబితా గత నెల చివరి నాటికే వచ్చింది. రెండు మూడు మండలాల ఎంపిక పెండింగ్‌లో ఉంది. అది పూర్తి చేసిన వెంటనే.. ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని, బోధకుల నియామక వివరాలను మండల అధికారులకు పంపిస్తాం. ఆ వెంటనే ఆయా పాఠశాలలకు ఎంఈవోలు పంపిస్తారు.

- ప్రవీణ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, మహబూబ్‌నగర్

కులవివక్షతో కూరగాయల టెండర్‌ను రద్దుచేసిన ఈవోపై చర్యలు తీసుకోవాలి

» అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసిన దళిత మహిళ


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దళిత మహిళ

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కుల వివక్షతో కూరగాయల టెండర్‌ను రద్దుచేసిన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర దేవాలయ ఈవో దీప్తిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం దళిత మహిళ శ్రీలత గద్వాలలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అలంపూర్ జోగుళాంబ ఆలయంలో కూరగాయల ఓపెన్ సీల్డ్ టెండర్‌లో పాల్గొని దక్కించుకున్నట్లు తెలిపారు. అయితే ఆలయ ఈవో మమ్మల్ని పిలిచి కులంపై ఆరా తీసి సర్టిఫికెట్ అడగగా ఇవ్వడం జరిగిందన్నారు. అయితే మాదిగ కులానికి చెందిన మీరు కూరగాయల టెండర్లు వేసే హక్కులేదని టెండర్‌ను రద్దు చేస్తున్నామన్నారన్నారు. అంతేకాకుండా తక్కువ కులం అని నాతో పాటు నా భర్తను దేవాలయం నుంచి వెళ్లగొట్టారని ఆరోపించారు. అంతేగాక నాపైన సోషల్‌మీడియా వేదికగా ఫిర్యాదు చేసిన అలంపూరుకు చెందిన బీజేపీ నాయకుడు రాజశేఖర్‌శర్మతో పాటు దుబ్బ వెంకటేశ్వర్లు నన్ను అవమాన పరుస్తూ అన్యమతస్తురాలు అంటూ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నన్ను, నా భర్తను వారి బారి నుంచి రక్షించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు కొత్తకోట విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన కొత్తకోట విద్యార్థులు

కొత్తకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):కొత్తకోట పట్టణంలోని ఎ స్సీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవి తెలిపిన వి వరాల మేరకు .. నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, వనపర్తి జిల్లా ఇన్‌చార్జి గోపాలం ఆధ్వర్యంలో సో మవారం విద్యార్థులకు సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న వారిలో 15 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి సైక్లింగ్ లో రాణించారు. ప్రశంసా ప్రతాలు అందజేసి, రాష్ట్రస్థాయి పోటీల కు ఎంపిక చేసినట్లు మాధవి తెలిపారు.

ఎంపికైన వారిలో ఐశ్వర్య, శ్రీలక్ష్మీ, పావని, ఎస్. నందిని, బిందు, అఖిల, కే నందిని, హిందూ, పూజ, చింటూ, మాధురి, అనూష, అక్షయ, ఇందు, కీర్తన ఉన్నారు. ఈ నెల 31 నుంచి నవంబరు 2వ తేదీ వరకు యాద్రాది భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో జరుగు రాష్ట్రస్థాయి పోటీల్లో వీరం దరు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపా ల్‌తో పాటు పీడీ స్వప్న, పీఈటీ ద్విభారతి అధ్యాపకులు అభినందించారు.

ధరణి సొమ్ము దక్కేదెప్పుడు?

» అయోమయంలో దరఖాస్తుదారులు
» ప్రభుత్వాలు మారినా తిరిగిరాని సొమ్ము
» ధరణి ప్రారంభమై నేటికి 7 సంవత్సరాలు
» 11,000 దరఖాస్తుదారులు
» దాదాపు రూ. 3 కోట్ల బకాయి


సేద్యం చేస్తున్న రైతు


ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి పాస్‌బక్కులు

అయిజ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారిన తర్వాత వారు తీసుకువచ్చే పథకాలు, పద్ధతులు, మార్పులు ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయి. కొన్ని ఉపయోగకరంగా ఉన్నప్పటికీ మరికొన్ని గుదిబండగా మారుతున్నాయి. అలాంటిదే భూచట్టంలో భాగమైనటువంటిది ధరణి. దీని సొమ్ము నేటికీ దరఖాస్తుదారుల దరికి చేరలేదు. వస్తాయో రావో అనే అయోమయంలో ఉన్నారు. ప్రభుత్వం మారి రెండేళ్లు కావస్తున్నా నేటికీ ఫలితం కనిపించడం లేదు. భూ సమస్యల పరిష్కారం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చింది. దాని స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోని రేవంత్‌రెడ్డి భూభారతి నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకువచ్చారు.

అయోమయంలో దరఖాస్తుదారులు

డబ్బులు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్న దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు. జిల్లా మొత్తంగా దాదాపు 1100 మంది వివిధ అంశాలు తెలియపరుస్తూ ధరణిలో స్లాట్ బుక్ చేసుకుని రద్దు అయిన, చేసుకున్న వారు ఉన్నట్లు తెలుస్తోంది. వారికి సంబంధించి మొత్తం దాదాపు రూ. 3 కోట్ల వరకు ఉండవచ్చని రెవెన్యూ అధికారులు అంటున్నారు. స్లాట్ బుక్ చేసుకుని రద్దు అయిన డబ్బులు నేరుగా దరఖాస్తుదారుల ఖాతాలోనే జమ అవుతాయని తెలుపుతున్నారు.చెల్లించిన డబ్బులు ప్రభుత్వ ఖజానాకు జమ అవుతున్నట్లు అంటున్నారు. తిరిగి అక్కడి నుంచే నేరుగా దరఖాస్తుదారులకు చేరుతాయంటున్నారు. డబ్బులు చెల్లింపు విషయం రెవెన్యూ శాఖకు సంబంధం లేదని పేర్కొంటున్నారు. ఈ విషయమై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందంటున్నారు. ఒక్కో అధికారి ఒక్కో సమాధానం చెబుతున్నప్పటికీ నేటికీ ధరణి సొమ్ము దరఖాస్తుదారుల ఖాతాలో జమకాకపోవటంతో ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేసేవిగా ఉండాలి



ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేసేవిగా ఉండాలి. ప్రభుత్వాలు మారిన ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకోకూడదు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ప్రజలు మాత్రం మారరు. వారి అవసరాలు, కష్టాలు, సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రభుత్వాలు చేసిన చట్టాల ప్రకారం ధరణి దరఖాస్తుదారుల సొమ్ము వీలైనంత త్వరగా వారి వారి బ్యాంకు ఖాతాలో జమచేసి ప్రజల ప్రభుత్వం అనిపించుకోవాల్సి ఉంది.

- హోమ్‌నీడ్స్ ఆంజనేయులు
అయిజ అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు

ప్రభుత్వ పరిశీలనలో ఉంది

ధరణి స్లాట్ బుకింగ్ సొమ్ము ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు మాకు అందలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల మేలు కోరి పని చేస్తాం. ప్రజలకు, ప్రభుత్వానికి బాధ్యులం. ఆదేశాలు అందిన వెంటనే అమలు చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మీనారాయణ,
అదనపు కలెక్టర్, గద్వాల

పత్తి, వేరుశనగకు తీరనినష్టం


తడిసి నీరు కారుతున్న పత్తి

అచ్చంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో పత్తి, వేరుశనగ రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రైతన్నలకు తీరిక లేకుండా పని చేసుకునే సమయంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రధాన వాణిజ్య పంటలైన పత్తి, వేరుశనగ పంటలు రైతుల ఆర్థిక మూలాలను దెబ్బతీశాయనే చెప్పవచ్చు. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న ముసురు వదలడం లేదు. ఇప్పటికే పత్తి నల్లబారి పోతూ గింజలు మొలకెత్తుతున్నాయి. వేరుశనగ విత్తేందుకు సిద్ధం చేసుకొన్న దుక్కుల్లో కలుపు పెరిగిపోయింది. అక్కడక్కడ మొలకెత్తిన వేరుశనగ ఎర్రబారి పంట పొలాల్లో విపరీతమైన కలుపు మొలకెత్తింది. వేలకు వేలు పెట్టుబడులు పెట్టిన రైతన్నలకు కష్టాలు తప్పడం లేదు. రైతులు ఇళ్ల వద్దనే పత్తిని నిల్వ చేసుకొంటున్నారు. ఇంకా రెండు రోజులు వర్షాలు ఇలాగే కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో రైతన్నల ఆశలు అడియాశలవుతున్నాయి.

మొలకెత్తిన మొక్కజొన్న


చెన్నంపల్లి శివారులో కింద పడిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు స్వామి

పెంట్లవెల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురు స్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట పండించిన రైతులు తీవ్రంగా న ష్టపోతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని రామా పురం, చెన్నంపల్లి, సోమశిల, అదే విధంగా పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరం, యంగంపల్లితండా, వేంకల్, పెంట్లవెల్లి, గ్రామాల రైతులు అత్యధికంగా మొక్కజొన్న పంటలు సాగు చేశారు. కానీ పంట కోత సమయంలో భారీ వర్షాలు కురవడంతో పంట చేను నేలకు ఒరిగి కిం ద పడింది. దీనికి తోడు నేలకు ఒరిగిన మొక్కజొన్న పంట మొలకలు ఎత్తుతున్నాయి. సెప్టెంబరు నెలలోనే కోయాల్సిన పంట వర్షాల కార ణంగా రైతులు ఇప్పటివరకు కూడా కోయలేదని ఆందోళన చెందుతు న్నారు. పంట కోయకపోవడంతో మొలకెత్తిన ధాన్యం రంగు మారి నా ణ్యత కోల్పోయి మార్కెట్‌లో గిరాకి తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించి న పంటకు కోత సమయంలో వర్షాలు తగ్గడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం కొ నుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలి



మొక్కజొన్న పంట పండించిన రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చాలా వరకు మొక్కజొన్న తీవ్రంగా నష్టపోయారు. పంట చేతికొచ్చిందన్న సమయంలో వర్షాల కారణంగా పంటను కోయలేకపోతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- అశోక్, రైతు, రామాపురం

కల్లు ఈత వనాల ధ్వంసం

పెబ్బేరురూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని పాతపల్లి గ్రామానికి చెందిన కొందరు గౌడ కులస్తులపై పడిరాక ఈత వనంలో చెట్లపై, కల్లు లోట్లను సోమవారం అర్ధరాత్రి తరువాత గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని కల్లుగీత కార్మికులు తెలిపారు. సుమారు 45 చెట్ల కల్లు లోట్లు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. ఈ విధంగా చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకొని గౌడ కుల వృత్తిదారులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులను కోరారు. ఈ దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోనట్లయితే రాష్ట్ర పరిధిలో, జిల్లా, మండల, గ్రామాల పరిధిలో గీతా కార్మికులు ఏకమై నిరసనలు తెలుపుటకు వెనకాడబోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని తగిన శిక్ష విధించాలని పాతపల్లి గ్రామ గౌడ కులస్థులు తెలిపారు.

వడ్డెమాన్ దళితులు కురుమయ్య సేవకులు

» తరతరాలుగా వస్తున్న ఆచారం
» అత్యంత నియమ నిష్టలతో స్వామి వారి ఉద్దాల తయారీ


చిన్న వడ్డెమాన్ గ్రామంలోని ఉద్దాల మండపంలో ఉద్దాలు తయారు చేస్తున్న దళితులు

చిన్నచింతకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కురుమూర్తి వేంకటేశ్వరస్వామివారి సేవలో దళితులు తరతరాలుగా తరిస్తున్నారు. మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని చిన్న వడ్డెమాన్ గ్రామంలో దళిత కుటుంబాలు బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాలోత్సవానికి స్వామి, అమ్మవారి పాదుకలను తయారు చేస్తున్నారు. దాదాపు 50 మంది వరకు నియమనిష్టలతో ఉద్దాల తయారీ పనిలో నిమగ్నమవుతారు. దీపావళి అమావాస్య నుంచి వీటి తయారీ మొదలు పెడతారు. వీటిని తయారు చేసే క్రమంలో నియమనిష్టల పాటిస్తారు. ఒక్క పూట భోజనం, రెండు పూటల స్నానం, ఉద్దాల మండపంలోని స్వామి వారికి పూజలు చేసి, ఉద్దాల తయారీ పని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం కొంత విశ్రాంతి తీసుకున్న అనంతరం రాత్రి 9గంటల వరకు ఉద్దాల తయారీలో ఉంటారు.

ఉద్దాలపై కథనాలిలా..

స్వామి వారి బ్రహ్మోత్సవాలు క్రీ.శ.1265లో ప్రారంభమయ్యాయి. వడ్డెమాన్, అమ్మాపూర్ సంస్థానాధీశులు ఇమ్మడి తిమ్మారెడ్డి వంశస్థులు పరిపాలించేవారు. ఓ ఏడాది బ్రహ్మోత్సవాల కంటే రెండు నెలల ముందు కురుమూర్తి కొండల్లో ఆవును పులి చంపింది. ఈ విషయాన్ని వడ్డెమాన్‌కు చెందిన దళితులకు స్వామి వారు కలలో కన్పించి ఇలా చెప్పారు.. ఆ ఆవు చర్మాన్ని తీసుకువచ్చి తనకు పాదుకలు తయారు చేయాలని తెలిపారు.

దాంతో వారు వాగులోని ఇసుకను తీసుకువచ్చి, ఓ గదిలో పోసి, పూజలు చేస్తారు. కార్తీక అమావాస్య రోజు అర్ధరాత్రి సమయంలో స్వామి వచ్చి పాదాలను ఆ ఇసుకలో మోపి వెళ్లిపోయారు.

ఆ ముద్రల ఆధారంగా వారు ఉద్దాలను తయారు చేస్తారు. అలాగే మరో కథనం కూడా ఉంది. కృష్ణానది తీరం వద్ద స్వామి వారు విశ్రమించినప్పుడు స్వామి వారికి పాదరక్షలు లేకపోవటాన్ని గంగమ్మ గమనించింది. స్వామి వారికి ఉద్దాలను (పాదులక)లను సమర్పించింది. ఆ తర్వాత స్వామి వారు చిన్న వడ్డెమాన్ చేరుకుని, తనకు ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉద్దాలను తయారు చేయాలని గ్రామస్థులను కోరారు.

అందుకు దళితులు అంగీకరించారు. అప్పటి నుంచి ఈ పనిని కొనసాగిస్తున్నారు. వాటిని తయారు చేసేందుకు ఆవు చర్మం, వన్నెరాకు, తగరం, మైనం, రేషం, పట్టు తదితర వస్తువులు వాడతామని వారు తెలిపారు.

ఇది మా పూర్వజన్మ సుకృతం



పూర్వం నుంచి మా వారు ఉద్దాలను తయారు చేస్తున్నారు. ఇది మా పూర్వజన్మసుకృతంగా బావిస్తున్నాం. ఉద్దాలోత్సవం ఎంతో ముఖ్యమైన ఘట్టం. దీనికి గాను స్వామి మా చేతులతో పాదుకలు తయారు చేయటం మా జన్మ ధన్యమైందని చెప్పాలి.

- దశరథ
ఉద్దాల తయారీదారు, వడ్డెమాన్

నియమ నిష్టలతో తయారు చేస్తాం



మేం అమావాస్య నుంచి ఉద్దాలు గుట్ట మీదకు వెళ్లే వరకు మేం అత్యంత నియమనిష్టలతో ఉండి, ఉద్దాలను తయారు చేస్తాం. ఇది మాకు ఎంతో ఆనందాన్ని ఇస్తున్నది. మా తాతల కాలం నుంచి తయారు చేయటం ఆనవాయితీగా వస్తున్నది.

- రామకృష్ణ,
ఉద్దాల తయారీదారు, వడ్డెమాన్

గ్రామంలో పండుగ వాతావరణం ఉంటుంది



కురుమూర్తి ఉద్దాలోత్సవం అంటేనే దేశ వ్యాప్తంగా ఓ ప్రత్యేకత ఉంది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఉద్దాలను తిలకించేందుకు వస్తారు. మా గ్రామంలో నూ పండుగ వాతావరనం ఉంటుంది. మేం కూడా తాతల కాలం నుంచి స్వామి సేవలో ఉంటున్నాం.

- శివసోమన్న,
ఉద్దాల తయారీదారు, వడ్డెమాన్


ఆలయ రాజగోపురం

దారులన్నీ కురుమూర్తి వైపే..

(5వ పేజీ తరువాయి)

కూర్చున్నారు. కోనేరులో స్నానాలు ఆచరించి, కొత్తగా మట్టి కుండలను కొనుగోలు చేసి, అందులో అన్నం, పచ్చి పులుసు చేసి దాసంగాలతో నైవేద్యం పెట్టారు. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై.. అప్పుడప్పుడు వర్షం కురిసినా లెక్క చేయక దాసంగాలు పెట్టారు.

పల్లమర్రి నుంచి చాట ఊరేగింపు


స్వామివారికి తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

ఉద్దాలోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటల ప్రాంతలో ఉద్దాలను ఉంచే చాటకు గ్రామంలో దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి, ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చాటను అధిక సంఖ్యలో తరలొచ్చిన భక్తులతో ఊరేగింపు చేశారు. తర్వాత గ్రామం శివారు నుంచి నెల్లికొండి మీదుగా పెద్ద వడ్డెమాన్ నుంచి చిన్న వడ్డెమాన్‌కు మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో చేరుకున్నాయి. అక్కడ ఉద్దాలను ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి సతీమని లలితమ్మ, జీఎంఆర్ సతీమని కవిత, ఆయా మండలాల నాయకులు, భక్తులు దర్శించుకున్నారు.

పోటీపడ్డ వేల మంది భక్తులు

సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఉద్దాలు సమీపంలోని ఊకచెట్టువాగుకు కదిలాయి. వాగులో కిలో మీటరు మేర కింద కూర్చున్న భక్తుల తలలపై నుంచి పోలీసుల బందోబస్తు మధ్య ఉద్దాలను తరలించారు. ఈ సందర్భంగా గోవిందనామస్మరణ మారుమోగింది. తిరుమలాపూర్ గ్రామం గుండా ఆంజనేయస్వామి ఆలయానికి చేరకున్న ఉద్దాలకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవుని చెరువు మీదుగా జాతర మైదానంలోని దశమికట్టకు చేరుకున్నాయి. జాతర మైదానంలో వేచి ఉన్న లక్షలాది మంది భక్తులు ఉద్దాలను తిలకించేందుకు పోటీపడ్డారు. శివసత్తువలు బంతిపూల దండలు మెడలో వేసుకుని, నెమలి కట్టలను చేత పట్టుకొని పూనకాలతో ఊగిపోయారు. జాతర మైదానంలో గంటన్నర పాటు ఉద్దాల ఊరేగింపు కొనసాగింది. రాత్రి స్వామి వారి రాజగోపురం చుట్టూ ఉద్దాలు ఉంచిన వాహనాన్ని తిప్పారు. అక్కడ ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు సంస్థానాధీశులు శ్రీరాంభూపాల్, ఆయల, పాలకవర్గం సభ్యులు దర్శించుకున్నారు.

భారీ భద్రత

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాలోత్సవానికి ఎస్పీ జానకి నేతృత్వంలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. జాతర మైదానంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, కంట్రోల్ రూం నుంచి భద్రతను పరిశీలిస్తున్నారు. ఎస్పీ స్వయంగా భద్రతను పర్యవేక్షించారు. ఎస్పీతో పాటు 2 అదనపు ఎస్పీలు, 6 మంది డీఎస్పీలు, 16 మంది సీఐలు, 44 మంది ఎస్ఐలు, 700 మంది కానిస్టేబుల్స్, స్పెషల్ పార్టీ పోలీసులు, షీటీం సభ్యులు బందోబస్తులో పాల్గొన్నారు.

జనమే జనం

జాతర మైదానం భక్తజనసంద్రంగా మారింది. మిఠాయి, అలంకరణ సామగ్గి, ఆట బొమ్మల దుకాణాలు, రంగుల రాట్నం, జంతు ప్రదర్శనశాల వెలిశాయి. వాటి వద్ద భక్తుల సందడి నెలకొంది. నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపారు.

ఎద్దుల బండ్లపై వస్తున్న భక్తులు



కురుమూర్తి స్వామి ఆలయం బయట వెలసిన గుడారాలు

క్రైం కార్నర్

జములమ్మ ఆలయంలో చోరీ



అయిజలో గల జములమ్మ ఆలయంలో చిందరవందరగా పడిఉన్న చీరలు

అయిజ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అయిజ పట్టణ సమీపంలోని తూము కుంట రహదారిలో ఉన్న జములమ్మ, యల్లమ్మ, ముక్కిడమ్మ, పరుశరామ ఆలయంలో చోరీ జరిగింది. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఆలయ సముదాయంలోకి ప్రవేశించారు. భక్తులు సమర్పించిన విలువైన చీరలతో పాటు వస్తు సామగ్రిని తీసుకెళ్లారు. మంగళవారం అమ్మవారికి ప్రీతి పాత్రమైన రోజు కావటం, ప్రత్యేక పూజలు కొనసాగుతుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పోలీసులు సంఘటన స్థలం చేరుకుని విచారించారు.

వేధింపులతోనే..

» పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ ఆత్మహత్యపై తండ్రి ఫిర్యాదు

జడ్చర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మిడ్జిల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది శ్రావణ్ వేధింపుల కారణంగానే తన కుమార్తె గ్రామపంచాయతీ కార్యదర్శి రాజశ్రీ(33) ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి బండారు కృష్ణయ్య మంగళవారం జడ్చర్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన రాజశ్రీకి, నారాయణపేటకు చెందిన శ్యాంసుందర్‌తో 2016లో వివాహం జరిపించామని తెలిపారు. వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. జడ్చర్లలో నివాసం ఉంటూ మిడ్జిల్ మండలం వెలుగోముల గ్రామపంచాయతీ కార్యదర్శిగా రాజశ్రీ ఉద్యోగం చేస్తుందని, మిడ్జిల్ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శ్రావణ్‌కుమార్ వేధింపులకు పాల్పడడంతో పాటు బ్లాక్‌మెయిల్ చేయడంతో భరించలేక సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఫిర్యాదు చేసాడని సీఐ తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

తల్లిని హత్య చేసిన కుమారుడికి రిమాండ్

కొత్తపల్లి, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి) :నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని గోకుల్‌నగర్ గ్రామంలో సోమావారం తెలవారుజమున తల్లిని కన్న కొడుకు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో రామకృష్ణను మంగళవారం పోలీసులు రిమాండ్ చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. జల్సాలకు అలవాటుపడి మద్యానికి అలవాటుపడ్డ అతడు డబ్బు ఇవ్వలేదని బండరాయితో తల్లిని కొట్టి చంపినట్లు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం కేసులో..

తిమ్మాజిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం కేసులో ఓ యువకుడిని మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 22న సదరు బాలిక ఇంట్లోనుంచి వెళ్లిపోవడంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. విచారణలో బాలిక అదృశ్యానికి కారకుడైన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

మద్యం అక్రమంగా అమ్ముతున్న ముగ్గురిపై కేసు నమోదు

కోస్గి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమంగా అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం కోస్గి, గుండుమాల్ మండలాల్లో చోటు చేసుకుంది. కోస్గి ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం... నారాయణపేట జిల్లా గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన అయ్యమోళ్ల కృష్ణయ్య తన కిరాణ షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడనే సమాచారంతో పోలీసులు వెళ్లి షాపులో పరిశీలించారు. 3 కాటన్‌ల బీరు, 16 క్వార్టర్ సీసాలు కనుగొన్నారు. అలాగే కోస్గి మండల పరిధిలోని నారాయణపేట రోడ్డు కడంపల్లి గ్రామ శివారులో నాగని బుగ్గప్పకు చెందిన హిమాలయ దాబాలో 18 బీరు సీసాలు పట్టుబడ్డాయి. అలాగే, సంపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం షాపులో 24 బీరు సీసాలు తనిఖీలో లభించాయి. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మద్యాన్ని అమ్ముతూ సిట్టింగులు నిర్వహిస్తున్న ముగ్గురు షాపుయజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లమల ఘాట్ రోడ్డులో కారు, బస్సు ఢీ

» తప్పిన ప్రమాదం



వటువర్లపల్లి బ్రహ్మగిరి మార్గంమధ్యలో ఢీ కొన్న బస్సు, కారు

బ్రహ్మగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతం శ్రీశైలం ఘట్ రోడ్డులో కారు, బస్సు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటన అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి, బ్రహ్మగిరి మార్గంమధ్యలో తవిసిపెంట ప్రాంతంలో చోటు చేసుకుంది. బ్రహ్మగిరి ఎస్ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం... కల్వకుర్తికి చెందిన పొడెండ్ల సురేష్ కారులో నలుగురు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం వెళుతున్నారు. పీకేటీ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళుతుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఎవరికీ ప్రమాదం జరుగలేదని ఇరువురు డ్రైవర్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతామని ఎస్ఐ తెలిపారు.

ట్రావెల్ బస్సును ఢీకొన్న కారు



ధ్వంసమైన కారు ముందుభాగం

మక్తల్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి) : ట్రావెల్ బస్సును కారు ఢీకొట్టిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సంఘటన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ వైపు వెళుతున్న ట్రావెల్ బస్సులో సాంకేతిక లోపం ఏర్పడటంతో గుడిగండ్ల సమీపంలో జాతీయ రహదారిపక్కన నిలిపాడు. వెనకి నుంచి వస్తున్న కారు ట్రావెల్ బస్సును ఢీకొనడంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కారు ఆపి ఉంచిన ప్రదేశంలో ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందని పలువురు పేర్కొన్నారు.

వ్యక్తి మిస్సింగ్, కేసు నమోదు

వనపర్తి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి మిస్సింగ్ అయ్యి కేసు నమోదు అయిన ఘటన వనపర్తి పట్టణ కేంద్రంలో టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ రెండవ ఎస్ఐ శశిధర్ వివరాల మేరకు.. వనపర్తి పట్టణ కేంద్రంలోని గణేష్ నగర్ కాలనీకి చెందిన కేకుల చెన్నయ్య అనే వ్యక్తి భార్య నాగమణితో గొడవ పడి ఈనెల 25న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. తమ బంధువుల ఇంట్లో ఎంత వెతికినా ఆచూకీ రాకపోగా తన ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. దీంతో చెన్నయ్య చెల్లెలు బిజ్జ చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అలంపూర్ ఆలయాల్లో లీకు వీరులు..!

ఆలయం దాటకముందే సోషల్ మీడియాలో వైరల్

» అన్యమతస్తులకు చేరవేస్తున్న పరిస్థితి
» మహిళా ఈవోపై అసభ్యకర పదజాలంతో ఆరోపణలు
» ఆలయంలో ఓ పూజారిపైనే అనుమానాలు
» కమిషనర్‌కు రాసిన లేఖ లీకు..



జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాల సముదాయం

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలు దేశంలో ప్రఖ్యాతిగాంచినవిగా ప్రసిద్ధిగాంచాయి. హిందూ దేవాలయాల్లో అతి ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయాలకు మసిపూసేందుకు కొన్ని దుష్టశక్తులు కలిసి పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. నవబ్రహ్మ ఆలయాలు కలిగిన ఈ ఆలయ సముదాయ నిర్వహణ బాధ్యతలు ఓ పాలక మండలి, అందుకు ఓ ప్రభుత్వ అధికారి, సిబ్బంది ఆధీనంలో నడుస్తూ వస్తున్నాయి. అయితే కొంతకాలంగా అలంపూర్ ఆలయాలలో తరచూ వివాదాలు సృష్టించబడుతున్నట్లు స్పష్టమౌతున్నది. అంతకుముందు ఎన్ని ఉన్నా ఆలయ పరిసరాలు దాటేవికావు.. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఆలయ కార్యనిర్వాహక వ్యవహారాలు, నిర్ణయాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, ఓ వర్గం అర్చక తప్పిదాలు ఇలా అన్ని విషయాలు ఆలయం దాటి అన్యమతస్తుల చేతికి చేరడమే పలు అనుమానాలకు తావిస్తోందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

పారదర్శకతే పాపమా..

నూతన ఈవోగా బాధ్యతలు చేపట్టాక ఆలయ అభివృద్ధి కోసం ఆమె తీసుకున్న కొన్ని కఠిన నిర్ణయాలే ఈ పరిస్థితికి దాపురించాయని తెలుస్తోంది. గత ఈవో హయాంలో, ఆలయంలో నిర్వహించే కార్యకలాపాలకు నిర్వహణ బాధ్యతల నిమిత్తం ప్రభుత్వం టెండర్లు పిలిచింది. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు ఆలయానికి చెల్లించేందుకు పాటపాడిన (దాఖలు) నగదును ఆరు నెలల్లోపు చెల్లించాలి. కానీ ఈవో దీప్తి బాధ్యతలు తీసుకున్న సమయానికి చెల్లించాల్సిన గడువు పూర్తయింది. ఇదే విషయం తన దృష్టికి రావడంతో ఆలయానికి ఆ సొమ్మును చెల్లించాలని పలు మార్లు సదరు టెండరుదారులకు కబురు పెట్టింది. దీంతో ఈవో ఆదేశానుసారం కొంతమంది టెండరుదారులు చెల్లింపులు మొదలుపెట్టారు. పట్టించుకోని ఒకరిద్దరు టెండరుదారుపై ఒత్తిడి తెచ్చేందుకు వారు నిర్వహిస్తున్న పనులను చట్టపరంగా ఈవో నిలిపివేయించింది. ఈ టెండరుదారులలోని కొందరు అధికార, రాజకీయ నాయకుల బినామీలే కావడం చేత సాధారణంగానే ఈవోపై రాజకీయ ఒత్తిడి పెరిగింది.

ఎవరా లీకు వీరుడు..?

నిశితంగా పరిశీలిస్తే... ఈ లీకులు కొంతకాలంగా పక్కా ప్రణాళికతో ఎవరికి చేరాలో వారికి చేరవేస్తూ అక్కడి నుంచి సోషల్ మీడియాకు చేరవేస్తూనే అన్యమతస్తులకు చేరేవిధంగా పకడ్బందీగా ప్లాన్ చేస్తున్నట్లు స్పష్టమౌతుంది. స్వామివారి ఆలయంలో పనిచేసే ఓ ప్రధాన అర్చకుడు కర్నూలు నగరంలోని ఓ సినిమా థియేటర్‌లో అలంపూరు ఎమ్మెల్యే దంపతుల పట్ల వ్యవహారించిన తీరుపై అక్కడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దీంతో సదరు అర్చకుడిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఏప్రిల్ 23న సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆలయంలో ఉన్న అర్చకులు రెండు వర్గాలుగా చీలిపోయాయి. అది మొదలు తరచూ ఆలయంలో వివాదాలు ఉత్పన్నం అవుతూనే ఉన్నాయి.

ఆ తర్వాత అమ్మవారి ఆలయంలో పని చేసే ముగ్గురు అర్చకులు స్థానిక నాయకుడి అన్న కూతురు వివాహం(డీస్)లో హాజరైన వ్యవహారంలో సదరు ముగ్గురు అర్చకులపై సస్పెన్షన్ వేటు కూడా పడటమే గాక క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆలయ ఈవోపై బదిలీ వేటు పడింది. ఇలాంటి చర్య రాష్ట్రంలో మొదటిది కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. ఈ వ్యవహారంలో బదిలీపై వెళ్లిన ఈవో పురేందర్ స్థానంలో జడ్చర్ల మండలం గంగారం ఆలయ ఈవో దీప్తిని ఇక్కడకు పంపించారు.

ఇంతలోనే నూతన టెండర్లకు నోటిఫికేషన్ రావడం, అందులో టెండరు దక్కించుకున్న మహిళ అన్యమతస్తురాలని ఫిర్యాదు వచ్చింది. దీంతో ఆ టెండరు ప్రక్రియను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవో పక్కన పెట్టారు. సదరు టెండరుదారును టెండరుదారుల వెనక ఉన్న రాజకీయ నాయకులు పావుగా వాడుకుంటూ ఈవోపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పలు హిందూసంఘాలు అంటున్నాయి.

ఇదే అంశంపై మహిళా ఈవోపై కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులలో అబద్ధపు ప్రచారంతో పాటు అసభ్యకరంగా రాస్తున్నారు. ఇది ఆలయ మహిళా ఉద్యోగ భద్రతకు భయం కలిగిస్తోందని, టెండరుదారురాలు అసలు ఈవోనే కలవలేదు.. అలాంటి ఆమెను కులంపేరుతో వ్యాఖ్యానించినట్లు వస్తున్న ఆరోపణలు అవాస్తవాలంటూ దేవాదాయ శాఖ కమీషనర్‌కు రాసిన ఓ లేఖ సోమవారం బయటకు పొక్కింది.

దీంతో వివాదం మరింత ముదిరింది. ఈ లేఖలో ఆలయంలో జరిగిన అంశాలన్నింటిని రాయడం వెనుక ఆ లీకువీరుడు పనేనని తెలుస్తున్నది. ఇదే అంశంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని ఆలయ మహిళా ఉద్యోగులు ప్రకటించారు.

జెన్‌కో ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టాలి

» తెలంగాణ ఇంజనీర్స్ అసోసియేషన్ సెక్రటరీ బీ మదన్‌మోహన్‌రెడ్డి
» జెన్‌కో డెరెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన ఇంజనీర్లు



శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో జెన్‌కో డైరెక్టర్ నాగ్యకు వినతి పత్రం ఇస్తున్న ఇంజనీర్లు

బ్రహ్మగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ఆరు సంవత్సరాలుగా జెన్‌కో ఉద్యోగులకు సాధారణ బదిలీలు కావడం లేదని వెంటనే జెన్‌కో యాజమాన్యం స్పందించి తక్షణమే బదిలీలు చేపట్టాలని మంగళవారం తెలంగాణ ఇంజనీర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఏడీఈ బీ మదన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఏఈ నరేష్ ఆధ్వర్యంలో జెన్‌కో డైరెక్టర్ నాగ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో పనిచేసే ఉద్యోగులు చాలా కాలంగా ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగం చేస్తున్నారు. ఇక్కడ సరైన, విద్య, వైద్యం అందుబాటులో లేదు. అత్యవసర పరిస్థితుల్లో పట్టణ ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లాలన్న అటవీశాఖ నిబంధనల ప్రకారం.. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల రాకపోకలను నిలిపి వేయడం జరుగుతుంది. జెన్‌కో సంస్థలో చాలా కాలంగా సాధారణ బదిలీలు కావడం లేదని రెండు వారాల క్రితమే బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం అనుమతి ఇచ్చినా నేటికీ అమలు కావడం లేదన్నారు.

బదిలీల ప్రక్రియలో ఎడమ గట్టు ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఇంజనీర్లు కోరారు. తొందరలోనే బదిలీలు జరుగుతాయని, ఇందుకు జెన్‌కో డైరెక్టర్ నాగ్య సానుకులంగా స్పందిం చారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

తీరుమారని ఫార్మా పరిశ్రమలు

» ట్రాక్టర్‌లో తీసుకువచ్చి టీఎస్ఐఐసీలోని ఖాళీ స్థలంలో పారబోస్తున్న వ్యర్థాలు



జడ్చర్ల మండలం పోలేపల్లి టీఎస్ఐఐసీలోని ఖాళీ స్థలంలో ట్యాంకర్‌లో తీసుకువచ్చి పారబోసిన కెమికల్ వ్యర్థాలు

జడ్చర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా పరిశ్రమలో నుంచి కెమికల్ వ్యర్థాలను ట్రాక్టర్ ట్యాంకర్‌లో నింపుకుని వచ్చి టీఎస్ఐఐసీ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో పారబోసిన సంఘటన మంగళవారం జడ్చర్ల మండలం పోలేపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని కార్తికేయ ఫార్మా పరిశ్రమ యూనిట్ 5లో నుంచి వ్యర్థాలను ట్రాక్టర్ ట్యాంకర్‌లో నింపుకుని వచ్చి టీఎస్ఐఐసీ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో పారబోస్తున్నారు. ట్రాక్టర్ ట్యాంకర్‌లో తీసుకువచ్చి వ్యర్థాలను పారబోస్తుండగా పట్టుకుని ప్రశ్నించగా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని, ఇక్కడే పారబోస్తామంటూ పరిశ్రమ ప్రతినిధి భయభ్రాంతులకు గురిచేశారంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

పరిశ్రమలో నుంచి తీసుకువచ్చి పారబోసిన కెమికల్ వ్యర్థాల నుంచి బురుగులు రావడంతో భయాం దోళనకు గురవుతున్నామని, దుర్వాసన వస్తుందంటూ వాపోయారు. ఖాళీ స్థలంలో వ్యర్థాలను పారబోయడంతో కెమికల్ వ్యర్థాలతో పెద్ద గోతిలా ఏర్పడిందని, ఆ గుంత మొత్తం కాలుష్యం నీటితో నిండిపోయిందంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేసారు. వ్యర్థాలను తీసుకువచ్చి పోస్తున్న పరిశ్రమలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను గ్రామస్థులు కోరుతున్నారు.

ఉపాధి అక్రమాలపై విచారణ జరిపించాలంటూ రాస్తారోకో



మక్తల్‌లో రాస్తారోకో చేస్తున్న ఖానాపూర్ గ్రామస్థులు

మక్తల్‌రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని ఖానాపూర్ గ్రామంలోని ఉపాధిహామీ పథక అవకతవకలపై విచారణ జరిపించాలని కోరుతూ గ్రామస్థులు మంగళవారం సాయంత్రం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గతంలో ఉపాధి హామీ అవకతవకలపై గ్రామానికి వచ్చిన విచారణ అధికారి నర్వ ఎంపీడీవో శ్రీనివాసులు, మక్తల్ ఎంపీడీవో రమేష్ ఈనెల 28న గ్రామంలో విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఉపాధి కూలీలు పనులు మానుకొని వేచి చూశారు. సాయంత్రం వరకు ఎవరూ రాకపోవడంతో మక్తల్ ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. వెంటనే అక్కడ చేరుకున్న పోలీ టసులు గ్రామస్థులను అధికారులతో మాట్లాడించి శుక్రవారం తప్పనిసరిగా విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. శుక్రవారం విచారణ జరిపించకపోతే అంబేడ్కర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమానికి దిగుతామని గ్రామస్థులు హెచ్చరించారు.

సమ సమాజం కోసం విద్యార్థులు పోరాడాలి

» ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం



సభకు హాజరైన విద్యార్థులు

వనపర్తి విద్యావిభాగం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో కుల, మత ఆర్థిక అసమానతలు లేని సమ సమాజం కోసం విద్యార్థులు పోరాడాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్స్‌లో రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి అధ్యక్షతన పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి రోజు నిర్వహించిన విద్యార్థుల బహిరంగ సభలో ఆయన ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా జార్జిరెడ్డి నాయకత్వంలో సాయుధ రైతాంగ పోరాటాల స్ఫూర్తితో 1947లో ఏర్పడ్డ పీడీఎస్‌యూ విద్యార్థి సంస్థ విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారంతో పాటు విద్య ప్రైవేటీకరణకు, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా చారిత్రాత్మక ఉద్యమాలను నిర్మించిందని కొనియాడారు. పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్‌బరీ గ్రామంలో ఆదివాసీలకు జరిగిన అన్యాయంపై విద్యార్థులు, ప్రొఫెసర్లు ఎదురొడ్డి నిలిచి పోరాడటంతోనే సమాజంలో మార్పు మొదలైందన్నారు. జార్జిరెడ్డికి చదువుకొని సైంటిస్టు అయ్యే అవకాశం ఉన్నా వదులుకున్నారన్నారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాడారన్నారు. పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవ చారి మాట్లాడుతూ... విద్యను మరింత వ్యాపారమయంగా మార్చడానికి డబ్ల్యూటీవో గాట్స్ ఒప్పందాల అమలుకు ప్రపంచ బ్యాంకు భారత పాలకవర్గాలపై తీవ్రమైన ఒత్తిడిని తీసుకొస్తున్నదన్నారు. అందు వల్లనే దేశంలోకి విచ్చలవిడిగా విదేశీ కార్పోరేట్ యూనివర్సిటీలకు గేట్లు బార్లా తెరుస్తున్నారన్నారు. పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు విజయ్ క న్నా, మాజీ నాయకుడు కవి జనజ్వాల, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆరెల్లి కృష్ణ, అఖిల భారత రైతు కూలీ సంఘం రా ష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సరళ, ఆంధ్ర ప్రదేశ్ పీడీఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎండీ రఫీ, కిరణ్ కుమార్ ప్రసంగించారు. అదే విధంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, రాష్ట్ర నాయకులు రంజిత్, సతీష్, గణేష్ కళాకారులు పాల్గొన్నారు.

ఠాణాను తనిఖీ చేసిన డీఐజీ



7వ జోన్ డీఐజీ ఎల్ఎస్.చౌహాన్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ స్టేషన్‌ను, పోలీస్ కార్యాలయాన్ని 7వ జోన్ డీఐజీ ఎల్ఎస్.చౌహాన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా అన్ని రికార్డులను, వివిధ విభాగాలను తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం సక్రమంగా అన్ని సక్రమంగా ఉన్నాయని, మంచిగా పని చేసి జిల్లాకు పేరు తీసుకురావాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ అశోక్‌రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ ఉపేందర్‌రావు, ఎస్‌బీ సీఐ కనకయ్యతో పాటు జిల్లాలో పోలీస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సుంకేసుల జలాశయానికి కొనసాగుతోన్న వరద



సుంకేసుల జలాశయం నుంచి విడుదల అవుతున్న నీరు

రాజోలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రాజోలి శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి వరద నీరు కొనసాగుతున్నది. గత కొన్ని రోజులుగా ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా నీటి విడుదల కొనసాగుతున్నది. మంగళవారం ఉదయం డ్యాంకు 47,500 క్యూసెక్కులు నీరు వచ్చి చేరింది. దీంతో సుంకేసుల జలాశయం నుంచి11 గేట్లు ఒక మీటర్ ఎత్తుకు తెరిచి 45,700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం సామర్థ్యం 1.20 టీఎంసీ కాగా ప్రస్తుతం 0.782 టీఎంసీగా ఉందని, నీటి నిల్వ 292.00 మీటర్లు కాగా ప్రస్తుతం 290.80 మీటర్లు నమోదు అయినట్లు డ్యాం జేఈ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

» ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు విద్యార్థుల ఆందోళన



క్యాంపు కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కల్వకుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయించాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసి విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగకుండా చూడాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ యాదవ్, ఏబీవీపీ నాయకులు హరికష్ణ, శివరాం, శ్రీకాంత్, మోహన్, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వర్షాకాలంలోనూ తాగునీటికి కష్టాలే

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

వనపర్తి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని చందాపూర్‌లో తాగునీటి సమస్య విపరీతంగా పెరిగింది. గ్రామంలోని ట్యాంకు నుంచి మిషన్ భగీరథ నీళ్ల చందాపూర్ గ్రామంతో పాటు కాశీంనగర్, దత్తాయిపల్లి తదితర తండాలకు సరఫరా అవుతుంది. గ్రామంలో పైపులైన్ సమస్యతో మిషన్ భగీరథ నీరు 15 రోజుల నుంచి అరకొరగా రా వడంతో గ్రామంలో 9, 10వ వార్డుల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారు లోని బోర్ బావి దగ్గర నుంచి బిందెలతో తాగు నీరు తెచ్చుకొని అరకొర నీటితో గడుపుతున్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని సంబంధిత గ్రామ కార్యదర్శిని కోరినా పట్టించుకోవం లేదని పలువురు వాపోతున్నారు.



నల్ల రాకపోవడంతో దర్శనమిస్తున్న ఖాళీ బిందెలు

ఎవరూ పట్టించుకోవడం లేదు



15 రోజుల నుంచి 9వ, 10వ వార్డుల్లో సాగు నీటి సమస్య విపరీతంగా ఉంది. మిషన్ భగీరథ నీరు రెండు రోజులకు ఒకసారి ఒక బిందె రెండు బిందెలు మాత్రమే వస్తున్నాయి. నీళ్ల సరిపోక బోరు బావుల వద్ద నుంచి బిందెలతో తీసుకొని వస్తున్నాం. వర్షాకాలంలోనే తాగు నీటి కొరత ఇలా ఉంటే రేపు ఎండాకాలం ఏ విధంగా ఉంటుందో భయమేస్తుంది.

- నిఖిల్, చందాపూర్ గ్రామం

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



గ్రామంలో సమస్య లేకుండా చూడాలి. ఎన్నికల సమయంలో మాత్రమే గ్రామాన్ని పట్టించుకుని మిగతా సమయంలో పట్టించుకోకుంటే సమస్యలు తీవ్రంగా ఉంటాయి. పట్టించుకోవాల్సిన గ్రామ కార్యదర్శి నిధులు లేవు, నేను ఏమి చేయాలని చెబుతున్నారు. సంబంధిత అధికారులు నీటి సమస్య లేకుండా చూడాలి.

- శివ చరణ్, చందాపూర్ గ్రామం

ఆక్సిజన్, వెంటిలేటర్ సదుపాయాన్ని వాడుకలోకి తేవాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి వైద్యవిభాగం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎంసీహెచ్‌తో పాటు జనరల్ ఆసుపత్రిలో త్వరితగతిన ఆక్సిజన్ వెంటిలేటర్ సదుపాయాన్ని వాడుకలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం, నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణంలో వర్షపు నీటి నిల్వను పరిశీలించి నిల్వ నీరు లేకుండా చేసేందుకు డ్రైనేజీలను నిర్మించి నీరు బయటికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం వెనక ఇంకుడు గుంతలను తవ్వించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు, సూపరింటెండెంట్ డాక్టర్ రంగరావు, జిల్లా ప్రో గ్రాం అధికారులు డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ పరిమల, ఆర్ఎంవోలు శివప్రసాద్, బంగారయ్య పాల్గొన్నారు.

విద్యుత్తు లైన్ ఏర్పాటు పనులు ప్రారంభించాలి

వనపర్తి రాజీవ్ చౌరస్తా : వనపర్తి మండలం పెద్దగూడెం తండాకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేందుకు త్వతరగతిన పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో పెద్దగూడెం తండాకు విద్యుత్ సరఫరా లైన్ ఏర్పాటు విషయంపై డీఎఫ్ఓ అరవింద్ ప్రసాద్ రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేందుకు అవసరమయ్యే స్థలం గురించి అధికారులు చేసిన నివేదికను పరిశీలించారు. అదేవిదంగా సవాయిగూడెం గ్రామ చెరువుకు నీటి సరఫరా చేసేందుకు కాలువ నిర్మాణం గురించి సంబంధిత శాఖ అధికారులతో ఆరా తీశారు. సవాయిగూడెం చెరువుకు నీరు అందించేందుకు కాల్వ నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్‌డీవో ఉమాదేవి, నీటి పారుదల శాఖ అధికారి మధు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, రాజశేఖర్, సునీత, రఘునాథ్ పాల్గొన్నారు.



ఎంసీహెచ్ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

బాల్య వివాహాల నిరోధానికి జాగ్రత్తలు తీసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు సూచించారు. బాల్య వివాహాలు చేసేందుకు సన్నద్ధం అవుతున్నా... కేసులు పెట్టాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి జిల్లా స్థాయి బాలల పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు జిల్లా సంక్షేమ శాఖ సిబ్బందితో పాటు పోలీసు అధికారులు, విద్యా, వైద్యం, సంక్షేమ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ... బాల్య వివాహానికి సహకరించే ప్రతీ ఒక్కరిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని, వారిని బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 36 బాల్యవివాహాలు జరగకుండా ఆపి బాధ్యులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీఆర్‌డీవో ఉమా దేవి, డీసీపీవో రాంబాబు, జిల్లా అధికారులు, సీఐలు, సీడీపీవోలు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి జూపల్లి పరామర్శ

వీపనగండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చిన్నంబావి మండల పరిధిలోని చిన్నమారు గ్రామ మాజీ సర్పంచు జ్యోతి భర్త తిరుమల్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం చిన్నమారు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదే విధంగా పెద్దదగడ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గ నాయకులు కొత్త కళ్యాణ్‌రావు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిదంబరెడ్డి, వడ్డెమాన్ బిచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



నందిమల్ల గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

అమరచింత, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగించుకోవాలని ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా , సింగిల్‌విండో చైర్మన్ గాడి కృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం అమరచింత మండల పరిధిలోని నందిమల్ల గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఖరీఫ్ సాగు రైతులు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వడ్ల కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని వారన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో వ్యవసాయ శాఖ అధికారులు నరేష్, మల్లేష్, నాయకులు మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, డైరెక్టర్ లు చుక్క వెంకట్‌రెడ్డి, విష్ణు, రవికాంత్, కమలాకర్ గౌడ్, తమ్మిరెడ్డి, రాజు, గణేష్, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వీపనగండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రాణి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పోలీసు స్టేషన్‌లో ఏయే విధులు నిర్వహిస్తారు, ఫిర్యాదులు సేకరించడం, కేసులు నమోదు చేయడం, రిమాండ్ వంటివి చూయించారు. నేరస్తులను పట్టుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని నేరస్తులు ఎవరు తప్పించుకునే పరిస్థితులు లేవని తెలిపారు. ప్రతీ ఒక్కరు చట్టాలను ఉపయోగించుకోవాలని సూచించారు.

ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర తెలుసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

వనపర్తి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర తెలుసుకోవాలి అని డీఎస్పీ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ (ఫ్లాగ్ డే) కార్యక్రమాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమానికి వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై, వనపర్తి సీఐ కృష్ణయ్యతో కలిసి ప్రారంభించారు. వనపర్తి పట్టణంలోని వివిధ విద్యాసంస్థల నుంచి దాదాపు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొని పోలీసు వ్యవస్థ, చట్టపరమైన విధులు, సాంకేతిక పద్ధతులపై ప్రత్యక్ష అవగాహన పొందారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు కేవలం నేరస్థులను పట్టుకోవడమే కాదు, సమాజంలో చట్టపరమైన అవగాహన పెంపు, భద్రతా వాతావరణం నిర్మాణంలోనే కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వనపర్తి సీఐ కృష్ణయ్య, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, రాంబాబు, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్, చెన్నామ్మ తామస్, అంజద్, సురేందర్, హరిప్రసాద్, శశిధర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వాసాలు, ధర్మాల పేరుతో దాడులు చేస్తే చట్టాలు వర్తించవా?


వనపర్తి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విశ్వాసాలు, ధర్మాల పేరుతో దాడులు చేసిన వారికి చట్టాలు వర్తించవా? అని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య మాదిగ ప్రశ్నించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో విలేకరులతో మాట్లాడారు. దేశ రాజధానిలో, అత్యున్నత న్యాయవ్యవస్థ సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి మీద దాడి జరిగితే ఇంకా కేసు ఎందుకు నమోదు చేయటం లేదన్నారు. ఎన్నో కేసులు సుమోటోగా స్వీకరిస్తున్న పోలీసు వ్యవస్థకు, న్యాయ వ్యవస్థకు చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడి కనిపించడం లేదన్నారు. సీజేపై జరిగిన దాడిని నిరసిస్తూ.. నవంబరు 1న లక్షలాది మందితో హైదరాబాద్‌లో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో దళితుల ఆత్మగౌరవ మహార్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ, కొమ్ము చెన్నకేశవులు మాదిగ, పరశురాం మాదిగ, మీసాల నాగరాజు మాదిగ, మద్దిలేటి మాదిగ, రవి వర్మ మాదిగ, కొండయ్య మాదిగ, శ్రీశైలం మాదిగ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టైగర్ జంగయ్య

బీసీ రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలి

పాన్‌గల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని పాఠశాల కరస్పాండెంట్ కాకం ఆంజనేయులు, పాఠశాల ప్రిన్సిపాల్ శేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో లిటిల్ స్టార్స్ హై స్కూల్లో 'రాజకీయ చదరంగంలో బీసీ రిజర్వేషన్ బిల్లు' అనే అంశంపై విద్యావంతుల చర్చా గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీసీ వర్గాలు గత 75 సంవత్సరాల నుంచి రాజకీయ, విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం వారిని గుర్తించి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రధానమంత్రిగా పిలువబడుతున్న నరేంద్రమోదీ బీసీలపై ఏమాత్రం ప్రేమ ఉన్న బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో చట్టం వేయాలని డిమాండ్ చేశారు. విద్యా వంతుల వేదిక ఆర్గనైజర్ రవి, ఎస్సీ విద్యావంతుల వేదిక నాయకులు ఎం. నాగరాజు, బీసీ విద్యావంతుల నేత కురుమయ్య, వెంకటస్వామి, వై. నాగరాజు, బి. నాగరాజు, రామ్‌చందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

న్యూస్ బాక్స్

పోలీసు స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ స్వాతి

అమరచింత, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని విజేత హైస్కూల్ విద్యార్థులు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లోని ఎస్ఐ, పోలీస్ సిబ్బంది, కంప్యూటర్, రికార్డు, రిసెప్షన్ గదులను విద్యార్థులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎస్ఐ స్వాతి మాట్లాడారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలన్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదారుడు, అభియోగం, నేరస్థుడు ,ఎఫ్ఐఆర్ నమోదు, జైలు శిక్ష, మైనర్లు వాహనాలు నడపడం, త్రిబుల్ రైడింగ్ తదితర వాటి గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ , మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- మునిసిపల్ కమిషనర్ నాగరాజు



ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కమిషనర్ నాగరాజు

అమరచింత, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రొసీడింగ్ పొందిన అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాలని మునిసిపల్ కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏడో వార్డులో ఇద్దరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అధికారులు, నాయకులతో కలిసి కమిషనర్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు నిర్ణయిత గడవలకు వేగవంతంగా నిర్మాణాలను పూర్తిచేయాలని ఆయన కోరారు. ఇప్పటికే లబ్ధిదారులకు అకౌంట్‌లలో బిల్లులు వేసిన విషయం కొత్త లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అధికారులు తెలియజేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులు ఇంకెవరైనా ఉంటే ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు మేనేజర్ యూసఫ్, ఆనంద్ నాయకులు అరుణ్‌కుమార్, రాకేష్ గౌడ్, శ్రీధర్ కన్నా, నరేష్ పాషా, గాజుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల బంద్‌ను జయప్రదం చేయాలి



ఆత్మకూరులో ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అమరచింత/ ఆత్మకూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30న ప్రైవేటు జూనియర్ డిగ్రీ కళాశాలల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రైవేట్ జూనియర్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్‌లకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ పిలుపుమేరకు 30న చేపట్టే బందులో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 1200 కోట్ల రూపాయలు విడుదల చేస్తానని చెప్పి ఒక్క రూపాయ కూడా నేటికీ విడుదల చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ 30న చేపట్టే బందులో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాఘవ, రమేష్, అప్రోచ్, జగదీష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి ఉద్దాలకు తరలిన భక్తులు

అమరచింత, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాల మహోత్సవాన్ని తిలకించడానికి మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కర్ణాటక ప్రాంతంలోని రాయిచూరు జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు మక్తల్ మాగనూరు కృష్ణ గద్వాల దరువు నర్వ మండలాలని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమరచింత మీదుగా కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా చాలా మంది భక్తులు బండెనుక బండి కట్టి 16 బండ్లు కట్టే అనే చందంగా ఎద్దుల బండ్లపై ఉద్దాలకు దానంగాను పెట్టడానికి బయలుదేరగా మరికొంతమంది భక్తులు ప్రత్యేక ట్రాక్టర్లు, ఆటోలు, ట్రాలీ, కార్లలో వందల సంఖ్యలో అమరచింత రాజీవ్ గాంధీ చౌరస్తా నుంచి శ్రీకృష్ణ నగర్ మీదుగా కురుమూర్తికి తరలి వెళ్లారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది ఉద్దాల మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై రైతులకు అవగాహన



ఖిల్లాఘణపురం రైతు నేస్తంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు గౌడ్, ఏవో మల్లయ్య

ఖిల్లాఘణపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అన్నదాతలకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు గౌడ్ అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పత్తి పంటను విక్రయించే రైతులు గతంలో మాదిరిగా నేరుగా సీసీఐ సెంటర్‌కి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కాపాస్ కిసాన్ ఆన్‌లైన్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకొని స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. మండలంలోని రైతులు వానా కాలంకు సంబంధించిన పత్తి కొనుగోలుకు దరఖాస్తు చేసి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న పత్తి తేమశాతం 12 ఉండాలన్నారు. వనపర్తి జిల్లాకు పత్తి రైతులకు సంబంధించి అడ్డాకుల మండల కేంద్రం దగ్గర ఎస్ఎస్ఆర్ మిల్లుకు కేటాయించినట్లు తెలిపారు. మండలంలో సుమారు 2 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారని గుర్తు చేశారు. రైతు నేస్తంలో రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందిస్తారని గుర్తు చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి మల్లయ్య, పీఏసీఎస్‌వైస్ చైర్మన్ క్యామ రాజు, గోపాల్, రమేష్, రాఘవేందర్‌రెడ్డి, సింగోటం, యాదయ్య పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

- మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్

వనపర్తి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తే గత పాలకులు పాలాభిషేకాలతో హంగు ఆర్భాటాలు చేసే వారని కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం పాలాభిషేకాలకు స్వస్తి పలికి ప్రకటనల ద్వారా ప్రజలకు తెలియజేసి సేవ చేస్తున్నామని వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వనపర్తిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మేఘారెడ్డి సీఎంని ఒప్పించి రూ.18.70 కోట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నిరంతరం తపిస్తున్నాడని, ప్రస్తుతం మునిసిపాలిటీలోని వార్డుల్లో సీసీ, డ్రైనేజీ నిర్మాణాల కోసం నిధులు తీసుకొచ్చిన ఎమ్మెల్యేకు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. గత పాలకులు మర్రికుంట చెరువును కుంటలా కాకుండా రిజర్వాయర్‌లా అస్తవ్యస్తంగా మార్చారని, దాంతో అలుగు నీరు రోడ్డుపై పారుతుందన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులను మభ్యపెట్టి ఇష్టానుసారంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇప్పించి, దూరదృష్టి లేకపోవడంతో ఇళ్లల్లోకి వరద నీరు వస్తున్న దుస్థితి తీసుకొచ్చారని అన్నారు. ఈ తప్పులను పనిపాట లేని బీజేపీ నాయకుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దాలనుకోవడం మానుకోవాలన్నారు. లక్కాకుల సతీష్, పాకనాటి కృష్ణ, బి.కృష్ణ, బ్రహ్మంచారి, పరశురాం, శరవంద, వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండారు శ్రీనివాస్‌గౌడ్

వేధింపులకు గురిచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి

వనపర్తి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మీరు చదువుతున్న కళాశాలలో కానీ మార్గ మధ్యంలో ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే.. భయపడకుండా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు విద్యార్థినులకు సూచించారు. వనపర్తి మండల పరిధిలోని నాగవరం శివారులోని సోషల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థినులకు రూరల్ పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ స్టేషన్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్లో ఉండే రిసెప్షన్ ఏ విధంగా ఉంటుంది. ఫిర్యాదులు ఏ విధంగా స్వీకరిస్తాము విద్యార్థినులకు చూయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థినులకు అందుబాటులో షీ టీం ఉంటుందని, అంతర్గతంగా ఏమైనా సమస్యలు ఉన్నా 100కు కాల్ చేసి వారిని సంప్రదించాలని అన్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలనుకుంటే ధైర్యంగా రావాలని, ఇక్కడ మీకు అనుగుణంగా మహిళా పోలీసులు కూడా ఉంటారని, భయపడకుండా మీ సమస్యలు చెప్పుకొని పరిష్కారం పొందవచ్చన్నారు.

ఉనికిని కాపాడుకోవడానికే బీఆర్ఎస్ పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే బీఆర్ఎస్ నాయకులు ప్రజలపై మునలికన్నీరు కారుస్తూ ఆరాటాలు, పోరాటాలు చేస్తున్నారని జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం మునిసిపల్ కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మునిసిపాలిటీ ఏర్పాటుకు ముందు గ్రామ పంచాయతీ ఖజానాలో రూ.350 కోట్ల నిధులు నిల్వ ఉన్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలకులు అభివృద్ధి పేరుతో నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. మునిసిపాలిటీలో డివైడర్‌ను అడ్డదిడ్డంగా నిర్మాణం చేపట్టారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన పనులకు డబ్బులు చెల్లించకపోవడంతోనే నేడు కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు జంకుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే మేఘా రెడ్డి సహకారంతో చేస్తామన్నారు. వెంకట్ రాములు, యుగేందర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులున్నారు.

బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చిన మిల్లర్లకే ధాన్యం

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వారం రోజుల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపులు చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... గత సీజన్‌లో మిల్లర్లు వారు పూర్తి చేసిన సీఎంఆర్‌కు అనుగుణంగానే బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, డీఎం జగన్, ఇతర అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



మిల్లర్లతో మాట్లాడుతున్న ఖీమ్యా నాయక్

వరి కోతలపై రైతులకు అవగాహన



వరి కోతలపై అవగాహన కల్పిస్తున్న డాకేశ్వర్‌గౌడ్

వీపనగండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :యంత్రాలతో వరి కోతలు కోసేటప్పుడు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వరి కోతలో మిషన్ యజమానులు డ్రైవర్లు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరి చేను పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాతనే కోతలు ప్రారంభించాలని తెలిపారు. కోత మిషన్ ఉపయోగించే ముందు బ్లోయర్‌లో ఉంచాలని, కోత మిషన్ యొక్క ఆర్పీఎం 19-20పైన ఉండాలన్నారు. కోత మిషన్ గేరు ఎటు బీ 1లో ఉంచి కోతను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో కోత మిషన్ యజమానులు, డ్రైవర్లు, రైతులు పాల్గొన్నారు.